

అదనపు బాధ్యతలు వద్దని అంగన్వాడీల నిరసన


ఎంపిడిఒకు వివరిస్తున్న అంగన్‌వాడీలు

కొయ్యలగూడెం : పింఛన్ల పంపిణీ బాధ్యతలను తమకు అప్పగించడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో కొయ్యలగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు పలు రకాల బాధ్యతలను ఇప్పటికే అప్పగించారన్నారు. ఈ పనుల ఒత్తిడిలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ పనులను అంగన్వాడీ కార్యకర్తలకు అప్పగించడం తగదన్నారు. ఈ మేరకు ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు శివరత్నకుమారి, శారద, జయలక్ష్మి, చంద్రకళ, జ్యోతి పాల్గొన్నారు.

'టోల్' బాదుడుకు రంగం సిద్ధం..!

జిల్లాలోని రాష్ట్ర రహదారులపై టోల్ వసూళ్లకు సర్కార్ ప్రణాళిక

మొదటి జాబితాలో రెండు జిల్లాల్లో మూడు రోడ్లు ఎంపిక

ఏలూరు-జంగారెడ్డిగూడెం, ఏలూరు-మేడిశెట్టివారిపాలెం, నరసాపురం-అశ్వారావుపేట రోడ్లు

రెండు జిల్లాల్లో దాదాపు 13 వరకూ రాష్ట్ర హైవేలు

ప్రతి రహదారిపైనా పిపిపి విధానంలో టోల్‌గేట్ల ఏర్పాటు

రవాణా ఛార్జీలు భారీగా పెరిగి ప్రజలపై పెనుభారం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని రాష్ట్ర హైవేలపై టోల్‌గేట్లు ఏర్పాటు చేసి రుసుము వసూలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు సంబంధించి తొలివిడత రోడ్ల జాబితాను సైతం విడుదల చేసింది. తొలి జాబితాలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏలూరు-జంగారెడ్డిగూడెం, ఏలూరు-మేడిశెట్టివారిపాలెం, నరసాపురం-అశ్వారావుపేట మొత్తం మూడు రాష్ట్ర హైవేలు ఉన్నాయి. ఈ రోడ్ల మరమ్మతులకు ఇక నుంచి ప్రభుత్వం నిధులు కేటాయించకుండా పిపిపి (ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం) విధానంలో కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. నేషనల్ హైవే తరహాలో టోల్‌గేట్లు ఏర్పాటు చేసుకుని, రోడ్లపై గోతులు పూడ్చే పని కాంట్రాక్టర్ చేసేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలపై పెనుభారం పడే పరిస్థితి నెలకొంది. రవాణా ఛార్జీలు భారీగా పెరగడంతో అన్ని వస్తువుల ధరలూ పెరిగి ప్రజల నెత్తిన పడనుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 13 రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వీటిలో ఏలూరు-భీమవరం, భీమవరం-నరసాపురం, ఏలూరు-తాడేపల్లిగూడెం, పాలకొల్లు-నిడదవోలు, తాడేపల్లిగూడెం-తణుకు, ద్వారకాతిరుమల-భీమవరం, పోలవరం-కొయ్యలగూడెం, ఏలూరు-మేడిశెట్టివారిగూడెం, ఏలూరు-జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం-భీమవరం వంటి రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఈ రోడ్లన్నీ నేషనల్ హైవేలకు అనుసంధానమై ఉన్నాయి. ఇప్పటికే జిల్లా పరిధిలో నేషనల్ హైవేపై కలపర్రు, ఉంగుటూరు ప్రాంతంలో రెండు టోల్‌గేట్లు ఉన్నాయి. కారుకు రూ.105, లారీలకు రూ.250 నుంచి టైర్ల సామర్థ్యం బట్టి టోల్ వసూలు చేస్తున్నారు. బస్సులకూ అదే పరిస్థితి కొనసాగుతోంది. తాడేపల్లిగూడెం నుంచి విజయవాడ కారులో వెళ్లేందుకు కిరాయికి మాట్లాడుకుంటే టోల్ ఫీజుల భారంతో కలిపి యజమానులు కిరాయి వసూలు చేస్తున్నారు. దీంతో కిరాయి తడిసి మోపెడవుతోంది.

రవాణా ఛార్జీల పెంపుతో జనంపై భారం..

జిల్లాలోని రాష్ట్ర హైవేల్లో ప్రతిరోజూ పెద్దఎత్తున వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. టోల్‌గేట్లు పెట్టి రుసుములు వసూలు చేస్తే రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో ధరలు పెరిగి ప్రజలపై పెనుభారం పడనుంది. బైక్, ఆటోలు, ట్రాక్టర్లకు టోల్ వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ పంట అంతా రైతులు లారీలపైనే రవాణా సాగుతోంది. దీంతో లారీల యజమానులు రైతుల నుంచి టోల్‌తో కలిపి కిరాయి వసూలు చేస్తారు. రైతులపై మరింత పెనుభారం పడనుంది. బస్సు టిక్కెట్ టోల్ ఛార్జీలు ప్రత్యేకంగా వసూలు చేస్తారు. దీంతో బస్సు టిక్కెట్ల ధరలు పెరగడంతో జనంపై భారం పడనుంది. ఇలా అనేక రూపాల్లో టోల్‌భారం జనాలపై పడే పరిస్థితి ఉంది. రోడ్ల మరమ్మతుల నుంచి ప్రభుత్వం తప్పించుకునేందుకు ఈ విధమైన ప్రణాళికతో ముందుకు సాగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్లు ఏర్పాటు ప్రతిపాదనపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం మొండిగా ముందుకు సాగితే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తప్పదనే చర్చ సర్వత్రా సాగుతోంది. ప్రభుత్వం రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్ల ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిజిఆర్ఎస్‌లో 217 అర్జీలు స్వీకరణ

అర్జీ పరిష్కారంలో అలసత్వం సహించేది లేదు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు సంబంధించి అర్జీలు జిల్లా అధికారులు తమ లాగిన్‌ను ఓపెన్ చేసి ఏరోజుకారోజు పరిశీలించి వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌తో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో 217 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. లాగిన్ ఓపెన్ చేసి చూడటానికి అవసరమైన పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు పిజిఆర్ఎస్‌లో జిల్లాలోని అర్జీల పరిష్కారానికి సంబంధించి సొంత లాగిన్‌ను ఓపెన్ చేసి ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత కనబర్చాలని, రీఓపెన్ లేకుండా అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు.


అందిన అర్జీల్లో కొన్ని..

భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన చింతల రవికుమార్ ప్రమాదవశాత్తూ తన కాలు పోయినందున ఎటువంటి పనులు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నానని, తనకు ఏదైనా ఉపాధి కల్పించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. విజయవాడ పటమటకు చెందిన ఎం.సందీప్ నూజివీడులోని తన వ్యవసాయ భూమికి పాస్ పుస్తకం ఇప్పించాలని అర్జీ అందజేశారు. ముదినేపల్లి మండలం పేరూరుకు చెందిన రాజేష్ తన భూమిని ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని అర్జీ అందజేశారు.

నేడు భూసమస్యలపై పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - వేలేరుపాడు

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు వేలేరుపాడు మండలంలో అన్ని రకాల భూసమస్యలపై ఈ నెల 26న నిర్వహించే ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రకాల భూసమస్యలపై మంగళవారం ఉదయం 10 గంటల నుంచి స్వీకరించనున్నట్లు వివరించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తిని గెలిపించండి

ఆటా జిల్లా అధ్యక్షులు సరియం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కుక్కునూరు

టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తిని గెలిపించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఆటా) జిల్లా అధ్యక్షులు సరియం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గోపీమూర్తి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం మండలంలో కుక్కునూరు, చీరవల్లి, మాధవరం, అమరవరం పాఠశాలల్లో యుటిఎఫ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా ఆలోచించి మన తరపున నిలబడే వారిని, మన సమస్యలపై ప్రశ్నించే వారిని, మన పోరాటాలకు తోడుండేవారిని గెలిపించాలన్నారు. అటువంటి వ్యక్తి బొర్రా గోపీమూర్తి పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్నారని, ఆయనకు ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అధికార పార్టీల అండతో గెలిచినవారు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల కోసం తప్ప ఉద్యోగుల కోసం ఏమి చేయరని స్పష్టం చేశారు. పిడిఎఫ్ అభ్యర్థులు ఏం చేస్తారనేది సాక్ష్యం చూపారని గుర్తు చేశారు. ఈ ప్రచారంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కమలకుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బానారి బాలకృష్ణ, మండల అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, తాడేపల్లి శ్రీనివాసరావు, ప్రజాసంఘాల నేతలు యర్నం సాయికిరణ్, వై.నాగేంద్రరావు, భయ్యాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యాన

నేడు చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులు, కార్మికుల డిమాండ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తూ ఈ నెల 26న చలో కలెక్టరేట్, మహాధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, రైతుకూలీ సంఘం (ఎపి) జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాషా, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదని విమర్శించారు. రైతులకు మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, చేతివృత్తిదారులు, గిరిజనులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎవరికి ఊరట..!

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు చదువుతున్న కళాశాలల ఖాతాలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము జమ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇదే సమయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను సాకుగా చూపి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము జమతో ఎవరికి ఊరట లభిస్తుందనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది.

కళాశాలల ఖాతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

30వ తేదీలోపు వెబ్‌సైట్‌లో వివరాల నమోదుకు ఆదేశం

75 శాతం హాజరు ఉంటేనే ఫీజు రీయింబర్స్‌మెంట్

కేంద్రం 60 శాతం వాటా చెల్లిస్తేనే ఎస్‌సి విద్యార్థులకు వర్తింపు.. లేకపోతే ఇబ్బందులే

జిల్లాలో పేరుకుపోయిన రూ.150 కోట్లు బకాయి

సొమ్ము కోసం కళాశాలల యాజమాన్యాల ఎదురుచూపు

ప్రజాశక్తి - భీమవరం

ఐటిఐ, పాలిటెక్నిక్, డిప్లమో, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇతర వృత్తి పరమైన కోర్సుల్లో చదువుతున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించనుంది. ఈ ఏడాది ఆయా తరగతుల్లో రెగ్యులర్ బ్యాచ్‌ల కింద చేరిన వారు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో లక్ష మంది వరకు ఉంటారని అంచనా. వీరంతా ఈ నెల 30వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంది. గత ప్రభుత్వ పుణ్యమా అని నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు నానావస్థలు పడుతున్నారు. విద్యాదీవెన పథకం కింద సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో గత ఐదేళ్లు విద్యార్థులు అష్టకష్టాలు పడ్డారు. పలు నిబంధనలతో బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిప్పారు. ఖాతాలకు నగదు వేస్తామని చెప్పినా.. కొందరికే లబ్ధి చేకూరింది. రెండు, మూడేళ్ల నుంచి చాలామంది విద్యార్థులకు నగదు జమకాకపోవడంతో వారు కళాశాలలకు చెల్లించలేకపోయారు. దీంతో సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు మొండికేస్తున్నాయి. 2019- 20లో ఏకమొత్తంలో చెల్లింపులు చేశారు. ఆ తర్వాత నాలుగు విడతల్లో ఇస్తామని చెప్పారు. 2020-21లో మూడు విడతలు, 2021-22, 2022-23, 2023-24లో ఆ ఊసే లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై దృష్టి సారించి కళాశాలల ఖాతాలో జమ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి దీనిని అమలులోకి తీసుకురానుంది. ప్రతియేటా జిల్లాలో రూ.100 కోట్లు మేర ప్రభుత్వం తల్లుల ఖాతాలో జమ చేస్తూ వచ్చింది. ఈ ఏడాది ఫీజులు పెరిగాయి. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులు అధికమయ్యాయి. దీంతో అదనంగా ప్రభుత్వంపై మరో రూ.20 కోట్లు భారం పడుతోంది. మొత్తంగా ఈ ఏడాది నుంచి రూ.120 కోట్ల మేర కళాశాలల ఖాతాల్లో జమ చేయాలి. జిల్లాలో 36 వేల మంది విద్యార్థులకు ఉపశమనం లభించింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందినవారికి తప్పనిసరిగా 75 శాతం హాజరు ఉండాల్సిందేననే నిబంధన పెట్టారు. లేకుంటే రీయింబర్స్‌మెంట్ వర్తించదు. కన్వీనర్ కోటాలో సీటు పొందిన వారు కూడా అనర్హులుగా మిగిలిపోనున్నారు. ఇప్పటికే ఆయా కళాశాలల యాజమాన్యాలే అర్హుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని ఆదేశాలు కూడా వెలువడ్డాయి.

వైసిపి ప్రభుత్వం ఎన్నికల ఏడాది ముందు నుంచి ఫీజులు చెల్లించలేదు. అంతకు ముందున్న బకాయిలనూ జమ చేయలేదు. ఇది మొత్తంగా కళాశాలలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. జిల్లాలో దాదాపు రూ.150 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. యాజమాన్యాలు వాటి కోసం ఎదురుచూస్తున్నాయి. వేతనాలు చెల్లించడానికి ఆపసోపాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జమ చేసే సొమ్ము కోసం కళాశాలలు ఎదురు చూస్తున్నాయి.

వీరికి మినహాయింపు..

ఈ ఏడాది ఎస్‌సి విద్యార్థులకు కేంద్రం నుంచి 60 శాతం వాటా రావాల్సి ఉన్నందున వారికి మినహా, మిగిలిన వారికి చెల్లింపులు పూర్తి చేయనున్నారు. ప్రీ, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాల కింద ఎస్‌సిలకు కేంద్రమే ఇస్తుంది. వారంతా తమ బ్యాంకు, తపాలా ఖాతాలను ఎన్‌సిపిఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో నమోదవ్వాలి. ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాలు, తపాలా కార్యాలయాలను సంప్రదించాల్సి ఉంటుంది. గతంలో వారి ఫీజును ప్రభుత్వమే కళాశాలలకు చెల్లించేది. ఇప్పుడు అటువంటి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లేదంటే ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు కాస్త ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ప్రయివేటు కళాశాలల్లో పీజీ కోర్సుల నిర్వహణకు యాజమాన్యాలు ఆసక్తి చూపడం లేదు. ఎన్నికల ముందు కూటమి అధిష్టానం దృష్టికి విద్యార్థులు తమ సమస్యను తీసుకెళ్లారు. ఇప్పుడు పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

చదలవాడ నాగరాణి, కలెక్టర్



ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంతమంది డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలు రాయనీకపోవడం జరుగుతోందని నా దృష్టికి వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ ఒక్క విద్యార్థికీ హాల్‌టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా అడ్డుకుంటే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వకుండా ఆపితే సంబంధిత కళాశాలను బ్లాక్‌లిస్టులో పెడతాం. ప్రభుత్వం ఫీజును కళాశాలల ఖాతాలకు జమ చేసే విధంగా జిఒ జారీ చేసింది. కళాశాలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తుంది.

పక్కాగా కొత్త ఓటర్ల నమోదు

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

పశుసంవర్ధక శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా అబ్జర్వర్ ఎంఎం.నాయక్




మాట్లాడుతున్న ఓటర్ల జాబితా అబ్జర్వర్ ఎంఎం.నాయక్

ప్రజాశక్తి - ఏలూరు

దోషరహిత ఓటరు జాబితాను రూపొందించడంపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని పశుసంవర్ధక శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా అబ్జర్వర్ ఎంఎం.నాయక్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి 2005 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలతో ఆయన సోమవారం సమీక్షించారు. తొలుత ఓటర్ల జాబితా అబ్జర్వర్ ఎంఎం.నాయక్‌కు కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిలు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమైందని, అటువంటి జాబితా రూపకల్పనలో ఎటువంటి తప్పులకు తావులేకుండా స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు పకడ్బందీగా ఓటర్ల జాబితా స్క్రూట్ని చేయాలని చెప్పారు. రానున్న నెల రోజుల సమయంలో ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బిఎల్‌ఒలతో ఇఆర్‌ఒలు సమావేశం నిర్వహించాలని చెప్పారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబిత రూపకల్పనకు బిఎల్‌ఒల సేవలను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో 18 నుంచి 20 ఏళ్ల వయస్సు కలిగిన యువతను ముఖ్యంగా డిగ్రీ కళాశాల విద్యార్థులను నూతన ఓటర్లుగా చేర్పించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఓటర్ల జాబితాలో లాజికల్, డెమోగ్రాఫికల్ పొరపాట్లు ఉంటే వాటిని పూర్తిస్థాయిలో సవరించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా కార్యక్రమంలో ఓటర్ల తొలగింపు సమయంలో ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇపిరేషియో, జండర్ రేషియో అంశాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించుకోవాలన్నారు. ఓటరుగా నమోదు, సవరణకు అర్హులైన వారు ఎవరైనాసరే 6, 7, 8, దరఖాస్తు ఫారాలను భర్తీచేసి అందించాలని చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పక్షాల ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలని తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడులూ జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలను వివరించారు. జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు, 28 మండలాలు ఉన్నాయని, వాటిలో ద్వారకాతిరుమల మండలం గోపాలపురం నియోజకవర్గంలో ఉందని తెలిపారు. ఏడుగురు ఎఇఆర్ఒలు ఉన్నారన్నారు. అక్టోబరు 29 నాటికి 16,38,436 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. వారిలో 7,99,781 మంది పురుషులు, 8,38,531 మంది మహిళలు, 124 మంది ఇతరులు ఉన్నారన్నారు. సర్వీసు ఓటర్లు 683 మంది ఉన్నారన్నారు. జిల్లాలో 1744 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటన్నింటిని పరిశీలించామని తెలిపారు. జండర్ రేషియో పరిశీలిస్తే ప్రతి వెయ్యి పురుషుల ఓటర్లకు 1048 మంది మహిళలు ఉనారన్నారు. ఇపిరేషియో పరిశీలిస్తే 757గా ఉందన్నారు. జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఈ నెల 9,10, 23,24 తేదీల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డిసెంబర్ 24 నాటికి క్లెయిమ్‌లు అభ్యంతరాలను పరిష్కరించడం పూర్తి చేస్తామన్నారు. తది జాబితాను 2025 జనవరి 6వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. జిల్లాలో తీసుకున్న ప్రత్యేక కార్యక్రమాలు ద్వారా 18-19 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన 43,833 మందిని ఓటర్లుగా నమోదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, విఆర్ఒలు, ఏలూరు ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, ఎపిఐఐసిజెడ్ఎం కె.బాబ్జి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, పలువురు ఎఇఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నర్సరీలపై చర్యలు తీసుకోవాలని వినతి


ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు

అక్రమంగా నిర్వహిస్తున్న నర్సరీలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భయ్యాన శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆర్‌డిఒకు సిపిఎం బృందం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ కుక్కునూరు మండలంలోని బోనగిరి, అల్లిగూడెం, ఇబ్రహీంపేట, గణపవరం, బంజరగూడెం, రాయిగూడెం, వెంకటాపురం, వేలేరు తదితర గ్రామాల్లో సుమారుగా 500 వరకు జామాయిల్ మొక్కలు పెంచి, విక్రయించడం కోసం నర్సరీలు నిర్వహిస్తున్నారని, ఆ నర్సరీలేవీ నిబంధనలు పాటించడం లేదని అన్నారు. ఆ నర్సరీలకు అనుమతుల్లేకుండానే విద్యుత్ వినియోగిస్తున్నారని, దీనివల్ల మండలంలో లో ఓల్టేజీ సమస్య నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ నర్సరీల నిర్వహణకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుని సంబంధిత నర్సరీల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో కార్మికులకు మండల కేంద్రంలో పార్కింగ్ స్థలం కేటాయించి, పికపింగ్, డ్రాపింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, శాఖా కార్యదర్శి ఎమ్‌డి.పుల్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవినీతిపై దర్యాప్తు చేపట్టాలి

ఏలూరు అర్బన్ : ఉపాధి హామీలో అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సంఘం జిల్లా కమిటీ బృందం వినతిపత్రం అందజేసింది. అనంతరం కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో రోజురోజుకీ అవినీతి పెరుగుతుందన్నారు. పని ప్రదేశాల్లో కూలీల సమస్యలు పరిష్కరించకపోగా వారి నుండే సొమ్ము వసూలు చేసే పద్ధతి జిల్లాలో సాగుతుందన్నారు. పోలవరం మండలంలో ఎపిఒ, ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ప్రజల నుండి సొమ్ము వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హార్టీకల్చర్‌కు కేటాయించిన నిధులను దుర్వినియోగం చేస్తూ భూస్వాములకు సొమ్ము అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కింది స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఉపాధి హామీ (డ్వామా)లో జరుగుతున్న అవినీతిపై కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో ఉపాధి కూలీలందరినీ ఏకం చేసి ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరరత్నం, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్, యాగంటి సీతా రాజశేఖర్, మాధవ దాసు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నూజివీడు పట్టణ కార్యదర్శిగా హనుమన్నలు



ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సిపిఎం నూజివీడు పట్టణ కార్యదర్శిగా ఎస్‌ఆర్.హనుమన్నలు ఎన్నికయ్యారు. మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా, శోభనాద్రి, నాగరాజు, పద్మాంజలి, కేశవరావు, వసంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సిపిఎం 26వ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

బుట్టాయగూడెంలో వచ్చే నెలలో మూడు రోజులపాటు జరిగే సిపిఎం 26వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఎన్‌టిఆర్ నగర్‌లో మండల కమిటీ సమావేశం మడకం కుమారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పార్టీ జిల్లా మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ జిల్లా మహాసభ డిసెంబర్ 13న భారీ ప్రదర్శన, బహిరంగ సభతో ప్రారంభమవుతుందని, 14, 15 తేదీల్లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు, మండ్రు శిరీష, భారగడ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో వైద్య సేవలందించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం నుంచి పంగిడిగూడెం రోడ్డు మధ్య ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంటనే తెరిచి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎ.శేఖర్‌కు సిపిఎం పట్టణ రెండో శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె.మాబుసుభాని మాట్లాడుతూ స్థానిక పంగిడిగూడెం రోడ్డులో గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించి ప్రారంభించి ఇప్పటికీ సుమారు నాలుగేళ్లు కావస్తున్నప్పటికీ పిహెచ్‌సిలో పేదలకు వైద్యసేవలందించడం లేదన్నారు. ప్రభుత్వంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరుపయోగంగా ఉందని 9, 10 వార్డు, పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ర్యాంపు వేసి, మట్టి ప్రహరీగోడ నిర్మించి తక్షణమే వైద్య సేవలందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను ఐక్యపరిచి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ రెండో శాఖ సభ్యులు వంగా గోపి, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఫిర్యాదులను పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తామని ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ హామీ ఇచ్చారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డిఎస్‌పి పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ఫిర్యాదులపై వెంటనే విచారణ జరిపి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆయన ఫోన్‌లో ఆదేశించారు.

రహదారికి మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి నుంచి తాటియాకులగూడెం వరకు ఉన్న జాతీయ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. అదే సమయంలో పోలవరం వరకు జాతీయ రహదారి మంజూరు కావడంతో అధికారులు రహదారిపై బూడిద సిప్స్‌ను పోసి తూతూమంత్రంగా పనులు చేసి వదిలేశారు. అప్పటి నుంచి దుమ్ము ధూళితో ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి జాతీయ రహదారికి సంబంధించిన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రహదారి నిర్మాణ పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంఎల్‌ఎ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన వారిలో వ్యాపారులు కక్కిరాల రాము, కోరుకొండ సూరిబాబు, రవి, పవన్, కిషోర్ పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట్రాజు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్నవారికి సిఎం సహాయనిధి నుంచి సహాయం అందించడం చాలా శుభ పరిణామమన్నారు.

ముసునూరు :సిఎం చంద్రబాబు పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మెరుగైన వైద్య సహాయం అందిస్తున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో మండలంలోని వడ్లమాను గ్రామానికి చెందిన తులిమెల్లి వెంకటరమణకు రూ.51,278 సిఎం సహాయ నిధి చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పచ్చని పంట పొలాల మధ్య ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని ఆక్వా తవ్వకాలు వెంటనే నిలుపుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ కోరారు. మండలంలోని వణుదుర్రులో జరుగుతున్న అక్రమ రొయ్యలు, చేపల చెరువుల తవ్వకాలపై సోమవారం తహశీల్దార్ సుభాని గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందించారు.

మహిళల భద్రతకు 'మిషన్ శక్తి'

మండవల్లి :మహిళలు, ఆడపిల్లల రక్షణ, భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.వెంకటనాగలక్ష్మి అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా ఇంగిలిపాకలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో సోమవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు 112 ,108,1098 పై అవగాహన కల్పించారు.

నేరాలు - ఘోరాలు

అద్దెకు కార్లు తీసుకుని తాకట్టు

ఇద్దరు అరెస్టు, ఆరు కార్లు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వారి చేతికి కారు దొరికిందంటే సినిమా కథలు చెప్పి తెలిసిన వారి దగ్గర తాకట్టు పెడతారు. అద్దెకు తీసుకున్న వారికి అరచేతిలో వైకుంఠం చూపించి వారి కంట పడకుండా తిరుగుతూ ఉంటారు. నగరంలో పలు కార్లను అద్దెకు తీసుకుని వాటిని తాకట్టు పెట్టిన మిత్ర ద్వయాన్ని ఏలూరు మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. తమ కార్లను ఇద్దరు వ్యక్తులు అద్దెకి తీసుకొని నెలలు గడుస్తున్నా తిరిగి ఇవ్వకుండా ఎవరికో తాకట్టు పెట్టారని అద్దెకు కార్లను ఇచ్చే వ్యక్తులు నగరంలోని టౌ టౌన్, త్రీ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. దీనిపై ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావును ప్రత్యేక విచారణ అధికారిగా నియమించారు. ఏలూరు మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు మొత్తం ఆరు కేసుల్లో ఆరు కారులను నిందితుల వద్ద నుంచి రికవరీ చేశారు. ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకులంక గ్రామానికి చెందిన ముంగర అభిషేక్, ఏలూరు రెండో పట్టణ పరిధిలోని పత్తేబాద ప్రాంతానికి చెందిన ఎల్ల భానుచందర్‌లను నిందితులుగా గుర్తించి వారి వద్ద నుంచి ఈ ఆరు కార్లు రికవరీ చేశారు.

ప్లాంటేషన్‌లో జామాయిల్ కలప స్వాధీనం

జీలుగుమిల్లి :మండలంలోని దర్భగూడెం ఎపిఎఫ్‌డిసి పరిధిలో అక్రమంగా లారీలో తరలిస్తున్న జామాయిల్ కలపను అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. దీనిపై విచారణ చేయగా కార్పొరేషన్‌కి సంబంధించినదిగా గుర్తించి కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌డిసి ప్లాంట్ మేనేజర్ వసంతకుమారి తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. లారీకి సంబంధించిన వ్యక్తులు పారిపోవడంతో అక్కడ ఉన్న కూలీలను విచారణ చేశారు. వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో కలపను స్వాధీనం చేసుకున్నారు.

24 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమ

ధాన్యం రైతుల హర్షం
మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఏలూరు ఇన్‌ఛార్జి మంత్రిగా నాదెండ్ల మనోహర్‌ను నియమించటం జిల్లా రైతులకు వరంగా మారింది. గతంలో ధాన్యం విక్రయించిన రైతులు సొమ్ముల కోసం రోజులు, నెలల తరబడి ఎదురుచూసేవారు. సమయానికి సొమ్ములు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పండుగలు కూడా చేసుకోలేకపోయేవారు. మరోవైపు పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగేవి. ఇన్‌ఛార్జి మంత్రిగా నాదెండ్ల మనోహర్ రావడం రైతుల పాలిట వరంగా మారింది. మంత్రి చెప్పినట్లుగానే ధాన్యం విక్రయించిన 24 గంటల్లో నగదు జమ అవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 24 గంటల్లో నగదు జమ అవ్వడంతో ఇదే తొలిసారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ధాన్యం రైతులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను విక్రయించిన రైతులకు, 24 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఆ ప్రకారంగానే ధాన్యం విక్రయించిన 24 గంటలు గడవకముందే రైతుల ఖాతాల్లో నగదు జమ అయింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన మరిసటి రోజునే నగదు జమ అవ్వడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన తర్వాత రెండు మూడు నెలలు, గత ప్రభుత్వ హయాంలో ఆరునెలలైనా నగదు జమ కాని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులకు పండుగ సమయాల్లో చేతిలో నగదు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

మండలంలో ఇప్పటివరకు ఐదు వేల టన్నుల ధాన్యం కొనుగోల కేంద్రాల ద్వారా కొనుగోలు చేయగా, 503 మంది రైతులకు రూ.తొమ్మిది కోట్లు వారి ఖాతాలో కూటమి ప్రభుత్వం జమ చేసింది. ధాన్యం విక్రయించిన ప్రతి రైతుకు పెండింగ్ లేకుండా ఇప్పటివరకు నగదు జమ చేయడంతో వారు సంతోషంగా ఉన్నారు. నగదు జమ కాని రైతులు ఇంకా ఎవరైనా ఉంటే తెలుసుకుని వారికి కూడా నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

24 గంటల్లో నగదు జమ అవ్వడం తొలిసారి
చీకటి వెంకట రామకృష్ణారావు, రైతు, మల్లయగూడెం



12 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఈ నెల 16వ తేదీన ధాన్యం విక్రయించాను. 17వ తేదీన నగదు జమ అయ్యింది. ఇన్నేళ్లలో ఇలా ధాన్యం వేసిన 24 గంటల్లో నగదు జమ అవ్వటం ఇదే తొలిసారి.

సంతోషంగా ఉంది
చీకటి లాల్ బహుదూర్ శాస్త్రి, రైతు, పోతునూరు



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఈ నెల 18వ తేదీన ధాన్యం విక్రయించాను. 19వ తేదీన నగదు జమ అయ్యింది. ఇలా 24 గంటల్లో నగదు జమ అవ్వడం సంతోషంగా ఉంది.

ఆలోచింపజేసిన లఘునాటిక ప్రదర్శన


కస్తూరి బా పాఠశాలలో...

ప్రజాశక్తి - ఏలూరు

కస్తూరిబా బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులు ప్రదర్శించిన లఘునాటిక అందరిని ఆకర్షించి ఆలోచింపజేసింది. 1962లో పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన ప్రతిజ్ఞ నేర్చుకుంటున్నారని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. ప్రతిజ్ఞ అమల్లోకి వచ్చి 61వ సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హైస్కూల్‌లో నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశం నా మాతభూమి అంటూ సాగే ప్రతిజ్ఞలో గొప్ప విషయాలను అందరూ ఆకలింపు చేసుకోవాలన్నారు. మహిళలపై హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్కూలు విద్యార్థినులు ప్రదర్శించిన లఘు నాటిక అందరిని ఆకర్షించి ఆలోచింపజేసింది. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత మాట్లాడుతూ విద్యార్థినుల్లో మానసికస్థైర్యం పెంచడానికి కర్ర సాము నేర్పిస్తున్నామని తెలిపారు. హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల దరఖాస్తు బ్రోచర్లను, పోస్టర్‌ను గుడిపాటి నరసింహారావు అందించారు. సంబరాలు విజయవంతం కావాలని, టీచర్లు పిల్లలను బాలోత్సవానికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ వెస్ట్ స్కూల్‌లో నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు బి.గంగాలక్ష్మి, లలితకుమారి, పి.పద్మకుమారి, పద్మసుశీల, రమాదేవి, ఎల్.నాగలక్ష్మి పాల్గొన్నారు.


శనివారపుపేట జెడ్‌పి హైస్కూల్‌లో...

శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు జి.ప్రకాష్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సభకు పి.రవీంద్ర, రిటైర్డ్ లోకో పైలట్ జి.రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత బచావో జిల్లా కార్యదర్శి పి.రవీంద్ర మాట్లాడుతూ 1963 నుంచి దేశవ్యాప్తంగా విద్యార్థులకు తెలుగువాడైన పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన ప్రతిజ్ఞను అన్ని భాషల్లో విద్యార్థులకు నేర్పిస్తున్నారన్నారు. జి.రాంబాబు మాట్లాడుతూ మహిళలపై హింసా వ్యతిరేక దినోత్సవం గురించి వివరించారు. హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల దరఖాస్తు బ్రోచర్ల, పోస్టర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు పి.పద్మలత, కె.గీతాంజలి, పతాంజలిరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై అదనపు పనిభారం వద్దు

ప్రజాశక్తి - కామవరపుకోట

పెన్షన్ల పంపిణీ విధుల నుంచి తమను మినహాయించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కామవరపుకోట ఎంపిడిఒ ముళ్లగిరి సరళకుమారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకురాలు సాక పుష్పరాజ్యం మాట్లాడుతూ అంగన్‌వాడీలపై అదనపు పనిభారం తగదన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, మరియమ్మ, పలువురు అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.


ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎస్‌టియు నాయకులు

పెదవేగి ఎంఇఒ-1గా ప్రసాద్

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి ఎంఇఒ-1గా ఎవిఎన్‌వి.ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పెదవేగి మండల కార్యవర్గం ఘన స్వాగతం పలికింది. ఎస్‌టియు మండలాధ్యక్షులు పరసా నాగార్జున, ఎండి షఫీ, గుప్త, భూషణం, రమేష్, ప్రవీణ్‌లు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. మండలంలో విద్యాశాఖ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంఇఒ-1 ప్రసాద్ తెలిపారు.

ఆర్‌డిఒ దృష్టికి పలు సమస్యలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయానికి గ్రీవెన్స్‌కి వచ్చిన ఆర్‌డిఒ ఎంవి.రమణను టిడిపి కుక్కునూరు మండల నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకుడు కోటగిరి సత్యనారాయణ, ఉపసర్పంచి పిచ్చుకల రాజు, నారాయణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా హింసా నిరోధక దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గిరిబాబు మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళల పట్ల వ్యవహరించాల్సిన తీరు గురించి విద్యార్థులకు వివరించారు. ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వి.క్రాంతి ప్రియ మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలు వివిధ రకాలుగా ఎదుర్కొంటున్న హింసలను, వాటిని నిరోధించే విధానాలను గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు, ఎస్.సుశీలత మాట్లాడారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి

భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రొఫెసర్, సుధామా ఫౌండేషన్ అధినేత సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. నవంబర్ 26 రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

కృత్రిమ కాళ్లు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


పేద, మధ్య తరగతి ప్రజలకు సాయం చేయడం అభినందనీయమని హీల్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ విజయ్ నున్న అన్నారు. ఇంగ్లాండ్‌లో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ శివరాత్రి వీరాంజనేయులు తమ కుమారుడైన యస్వంత్ పుట్టినరోజు సందర్భంగా అందించిన వితరణతో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కలవకోల్లు భిక్షాలరావు, ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన వంకదారు ఉమామహేశ్వరరావులకు కృత్రిమ కాళ్లను అందించారు.

ఎస్‌సి, బిసిలకిచ్చిన హామీలు అమలు చేయాలి

పంచాయతీ కార్యాలయం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కూటమి ప్రభుత్వం ఎస్‌సి, బిసిలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని రెడ్డిగణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 50 ఏళ్ల పైబడిన ఎస్‌సి, బిసిలకు పెన్షన్ నమోదు చేస్తామని, రూ.నాలుగు వేల పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకొచ్చి ఐదు నెలలు దాటినా ఆ హామీ నెరవేర్చలేదన్నారు. డిసెంబర్ నుంచి అయినా పింఛను నమోదు చేసి ఎస్‌సి, బిసిలను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ కూలీలు ఎక్కువ ఎస్‌సి, బిసిల్లోనే ఉన్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం రెడ్డి గణపవరం సచివాలయం వెల్ఫేర్ ఆఫీసర్‌కి ఆధార్‌కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో చెన్ను దుర్గారావు, గంగుల గౌరయ్య, ఉమ్మడి ఏసు, వి.విజయ, రమేష్, జి.జానేష్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న ఫ్రాన్సిస్

ధాన్యం కొనుగోలుపై అవగాహన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని స్థానిక రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కార్యక్రమంపై రైతు సేవా కేంద్రం సహాయకులకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 3600 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా సుమారు 9450 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేయనున్నట్లు తహశీల్దార్ పివి.చలపతిరావు తెలిపారు. ప్రస్తుతం మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలైన రెడ్డిగణపవరం, జైనవారిగూడెం, బుట్టాయగూడెం, విప్పలపాడు, నూతిరామన్నపాలెంలో 28 వేల గోనెసంచులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు, పౌర సరఫరాల శాఖ అధికారిని కె.పద్మావతి, పిఎస్‌ఎ ఇన్‌ఛార్జి సాయిబాబా, బుట్టాయగూడెం విఆర్‌ఒ కె.పోతురాజు పాల్గొన్నారు.

ముసునూరులో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

కృష్ణా మిల్క్ యూనియన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశాల మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు మిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ శనగల వెంకటశివజ్యోతి తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు పశు వైద్యశాలలో సోమవారం ఉచిత పశువైద్య మెగా శిబిరం నిర్వహించారు. మండలంలోని ముసునూరు, చింతవల్లి, గోగులంపాడు, కొర్లకుంట, సింహాద్రిపురం, తాళ్లవల్లి, కాట్రేనిపాడు, గోపవరం గ్రామాల నుంచి ఎక్కువమంది పాడి రైతులు, పశువుల మీద ఆధారపడి జీవనం సాగించే కుటుంబాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆదేశాలతో ఈ మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ ప్రాజెక్ట్ మేనేజర్ మాగంటి హరిబాబు, పశువైద్య శాఖ ఎడి లింగయ్య, యూనియన్ డిడి లింగప్రసాద్, వైద్యులు వెంకట చైతన్య, ముసునూరు పాల సొసైటీ సంఘ అధ్యక్షులు గాజులు ఏడుకొండలు, సూపర్‌వైజర్ పాకనాటి సీతారామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని బైఠాయింపు

ప్రజాశక్తి - దెందులూరు

జీతాలు పెంచాలని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు గత వారం రోజుల నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా యాజమాన్య మొండి వైఖరికి నిరసనగా సోమవారం గేటు బయట రెండు గంటలపాటు బైఠాయించారు. ఈ సందర్భంగా సంఘం ప్రెసిడెంట్ బెజవాడ పద్మ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ సానుకూలంగా జీతాల పెంపుదల విషయంలో ముందుకు రావాలని కోరారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. ధర్నా అనంతరం మేనేజ్‌మెంట్ నాగేశ్వరరావు నాయకత్వాన్ని పిలిచి చర్చలు జరిపారు. మంగళవారం కల్లా పెంపుదల విషయం ఫైనల్ చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మిక వర్గం విధులకు హాజరయ్యారు.

జెండర్ ఆధారిత హింసను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు స్వయం సహాయక సంఘాలు, ఇతర ప్రభుత్వ విభాగాలు, పలు పౌర సమాజాల అనుసంధానంతో నిర్వహించే జాతీయ ప్రచారాన్ని జయప్రదం చేయాలని వెలుగు ఎపిఎం దయాల రాజశేఖర్ కోరారు. నేషనల్ జెండర్ క్యాంపెయిన్-నయీ చేతన్ 3.0లో భాగంగా సోమవారం ఆగిరిపల్లి వెలుగు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ద్వారకాతిరుమల : మండలంలోని వెలుగు కార్యాలయంలో నయి చేతన్ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పోలీస్ శాఖ ఎఎస్‌ఐ ఎస్‌కె.అమీర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మేడం లక్ష్మీస్వరాజ్యం, ఎపిఎం అరవింద, హెచ్‌డి సీసీ గౌరీశంకర్, క్లస్టర్ సీసీలు, గ్రామ స్థాయి విఒ, ఒబి, విఒఎలు పాల్గొన్నారు. జెండర్ ఆధారిత వ్యతిరేక ప్రచారం ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే 23 వరకు నిర్వహించనున్నట్లు వెలుగు ఎపిఎం అరవింద తెలిపారు.

గౌడ సంక్షేమ సంఘ వన సమారాధన

మండవల్లి :సర్దార్ పాపన్న, గౌతు లచ్చన్నలను ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించి దేశం గర్వించదగ్గ స్థాయికి గౌడ సంఘం యువత ఎదగాలని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ తెలిపారు. భైరవపట్నం శివారు శోభనాద్రిపురం అగ్రహారం శివాలయ ప్రాంగణంలో కమిటీ అధ్యక్షుడు పడమటి గణేష్ అధ్యక్షతన నిర్వహించిన 20వ కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘ కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన సోమవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గౌడ సంఘమంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మోదుగుమూడి మదన్మోహన్ కుమార్తె ఉషశ్రీ మణికంఠ ఆర్థిక సహాయంతో నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు పోసిన చెంచు రామారావు, బర్రా చల్లమయ్య, మాజీ మంత్రి జోగి రమేష్, ఎంఎల్‌ఎ కాగిత కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగానికి అర్హులైనవారికి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్‌ఐ ఉద్యోగానికి అర్హులైన హెడ్ కానిస్టేబుల్, ఎఎస్‌ఐ మహిళా, పురుష అభ్యర్థులకు రాత పరీక్షలను నిర్వహిస్తున్నామని, అనంతరం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ తెలిపారు. పెదవేగిలోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ కార్యాలయంలో సోమవారం, మంగళవారం ఎస్‌ఐ ఉద్యోగానికి అర్హులైన పోలీసు సిబ్బందికి రాత పరీక్షలు, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలను ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు 115 మంది పురుష, మహిళా అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు.

13 నుంచి జాతీయ నృత్యోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్యభారతి 29వ జాతీయ నృత్యోత్సవాలు, నృత్య పోటీలు డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో వైఎంహెచ్‌ఎ హాలులో నిర్వహించనున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షులు అంబికా కృష్ణ, అధ్యక్షులు మనోహర్ గోపాల్ నాని, వ్యవస్థాపకులు కార్యదర్శి నాట్యాచార్య దువ్వి హేమ సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హేలాపురి, లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్ట్, హిందూ యువజన సంఘం, లయన్స్ జిల్లా 316జి, దీపక్ నెక్స్‌జెన్ సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు సత్తిరాజు వర్ధంతి సభ

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని మర్రిగూడెం పరిధిలో ఉన్న సున్నపురాళ్లపల్లిలో సత్తిరాజు వర్ధంతి సభ మంగళవారం నిర్వహిస్తున్నట్లు రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తిరాజుకు విప్లవ జోహార్లు అర్పిస్తూ సున్నపురాళ్లపల్లిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భవనం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రంలో ఉన్న గిరిజన బాలుర కళాశాల వసతి గృహానికి నూతన భవనాలు నిర్మించాలని, బాలికల కళాశాల హాస్టల్‌కు అదనపు భవనాలు నిర్మించాలని పిడిఎస్‌యు నాయకులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పివి.చలపతిరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బన్నె వినోద్ మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడ నూతన భవనాలు, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు వంటి మెరుగైన సదుపాయాలతో నిర్మించాలని కోరారు.

'త్యాగాలతో పేదలకు మేలు'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సిపిఐ ఎన్నో త్యాగాలు చేసి పేద ప్రజలకు మేలు చేకూర్చిందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. మండల కేంద్రంలో సిపిఐ మండల నాయకులు బేతి కిషోర్ అధ్యక్షతన మండల స్థాయి జనరల్ బాడీ సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వనజ మాట్లాడుతూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తుల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వందల కోట్లు లంచం తీసుకుని దేశ ప్రజానీకాన్ని మోసం చేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రభుత్వాలు అధికారంలోకి రావడానికి ఎన్నో మాయ మాటలు చెప్పి, అధికారంలోకొచ్చాక ప్రజలను గాలికి వదిలేస్తున్నాయన్నారు. తొలుత అక్కినేని వనజ అరుణ పతాకాన్ని ఆవిష్కరించి, ఎర్రజెండాకు గౌరవ వందనం సమర్పించారు.

బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు, మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీలు హెల్పర్లకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒ సూపరింటెండెంట్ కమల విష్ణుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అయ్యార్ల జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్న ఇప్పటివరకు మధ్యాహ్నం భోజన పథకం ఏజెన్సీలకు గౌరవ వేతనాలు విద్యార్థులకు మెనూ ఛార్జీలు చెల్లించకపోవడం దారుణమన్నారు.

'కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులు పెట్టొద్దు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అధికారులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించి కింది స్థాయి ఉద్యోగులను ఇబ్బంది పెట్టటం సరికాదని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.ఎ.సాల్మన్‌రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డిదొర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ఏరియాలో సాయంత్రం తొందరగా సూర్యాస్తమయం అవ్వడంతో విద్యార్థులు భద్రంగా ప్రయాణించేందుకు కష్టమవుతుందని తెలిపారు. ఏజెన్సీ ఏరియాలో పైలెట్ ప్రాజెక్టుగా సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాల నిర్వహించాలని ఎంపిక చేసిన పాఠశాలలను మినహాయించాలని పేర్కొన్నారు.

ప్రకటన

నా క్లయింటు పాతపాటి కనకదుర్గ, (ఆధార్ నెం.2598 5437 2504) (ఫోన్ నెం.9036240311) భర్త : లేటు PVRK బంగార్రాజు, ఏలూరు వారి భర్త తాలూకు డిశ్చార్జ్ బుక్ మరియు ఐడి కార్డు 14583735 - వై రును వారు ఏలూరు పాతబస్టాండ్ నుండి పెన్షన్ లైనుకు వారి యింటికి వెళుచుండగా మిస్ అయినాయి. కావున సదరు డిశ్చార్జ్ బుక్ మరియు ఐడి కార్డు 14583735 - వై ఎవ్వరికైనా దొరికిన ఎడల నా క్లయింటు పాతపాటి కనకదుర్గ, (ఫోన్ నెం.9036240311)కు లేదా నాకు అందచేయవలసినదిగా కోరుచున్నాను.

స్థలం : ఏలూరు
తేది.25-11-2024

కె.కృష్ణమాచార్యులు
న్యాయవాది, ఏలూరు.
ఫోన్‌నెం.9440116456.